క్లుప్తంగా

నేడు విద్యుత్ విజయోత్సవాలు

నిజాంపేట్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ ఫంక్షన్‌హాలులో విద్యుత్ విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు జీడిమెట్ల ఆపరేషన్స్ డీఈ నర్సింహారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ విజయోత్సవంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు హాజరు కావాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు. షాపూర్‌నగర్ ఎంజేఎస్ ఫంక్షన్‌హాలులో జరిగే తెలంగాణ ఉత్సవాల్లో నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని మేయర్ నీలారెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథులుగా హాజరు కానున్న ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో రావాలని ఆమె పిలుపునిచ్చారు.

నాలాల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు


గణేష్‌నగర్ నాలా వద్ద జరుగుతున్న పనులు

జగద్గిరిగుట్ట: నాలాల వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రానున్న వర్షాకాలంలో కాలనీల నుంచి వెళ్లే ప్రధాన నాలాల వద్ద ఇరువైపుల 5ఫీట్లపైకి గోడ నిర్మాణాలు చేపడుతున్నారు. గతేడాది కుత్బుల్లాపూర్‌లో నాలలో పడి ఓ వ్యక్తి మరణించిన విషయం తెలిసిందే. అటువంటి ప్రమాదం మళ్లీ జరకుండా అధికారులు ముందు జాగ్రత్తలు చేపడుతున్నారు.

దళితులు, నిమ్నవర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి


ప్రగతినగర్ కమాన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ మేకల నగేష్

నిజాంపేట్: భారతరాజ్యాంగం ద్వారా దళితులు, నిమ్నవర్గాల ప్రజల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని నిజాంపేట్ కార్పొరేషన్ దళిత సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మేకల నగేష్ అన్నారు. ప్రగతినగర్ కమాన్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విధానాలను అమలు చేయడం ద్వారా సమసమాజ స్థాపన సాధ్య పడుతుందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలగం చంద్రయ్య, రామనర్సయ్య, బాలపీరు, రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పైనే రిపేర్లు



రంగారెడ్డినగర్: షాపూర్‌నగర్ చౌరస్తాలోని గాజులరామారం - షాపూర్‌నగర్ రోడ్డులో ఆటోలను ఫుట్‌పాత్‌లపైకి ఎక్కించి రిపేర్లు చేస్తున్నారు. దీంతో పాదచారుల రోడ్డుపై నుంచి నడవాల్సి వస్తోంది. ట్రాఫిక్ సిబ్బంది అక్కడే విధులు నిర్వర్తిస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగించాలని పాదచారులు కోరుతున్నారు.

రాకపోకలకు ఆటంకం

రంగారెడ్డినగర్: గాజులరామారం నుంచి షాపూర్‌నగర్ మార్కెట్‌కు వాహనదారులు షాపూర్‌నగర్ ఆంధ్రాబ్యాంక్ గల్లీ మీదుగా రాకపోకలు సాగించేవారు. ఏమైందో.. ఏమో ఏడాది క్రితం రాత్రికి రాత్రి ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డుగా సిమెంట్ బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. ఏదైనా ప్రాంతంలో ప్రభుత్వ ముఖ్య కార్యాలయాలు ఉంటే రాకపోకలు సాగించకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేస్తారు. కాని ఈ కార్యాలయం లేకుండా బారికేడ్‌లు ఏర్పాటు చేయడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆటకంగా మారిన ఈ బ్యారికేడ్‌లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


షాపూర్‌నగర్‌లోని ఆంధ్రాబ్యాంక్ గల్లీ రోడ్డుకు అడ్డుగా బారికేడ్‌లు



కొత్త ఠాణా

- నేడు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం
- సూరారం పీఎస్‌ను ప్రారంభించనున్న మంత్రి మల్లారెడ్డి
- పోకిరీలు, దొంగల బెడదకు చెక్
- సూరారం పరిధిలో తగ్గనున్న క్రైంరేట్

సుభాష్‌నగర్: సూరారంకు కొత్తగా మంజూరైన పోలీస్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధమైంది. జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ స్థలంలో కొంత స్థలాన్ని కేటాయించగా 260 గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఠాణా సోమవారం ప్రారంభోత్సవం కావడంతో తుది మెరుగులు దిద్దుకుంటుంది. నూతన పీఎస్‌ను అధికారికంగా మంత్రి మల్లారెడ్డి పోలీసు ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభించనున్నారు.

సైబరాబాద్‌లో ఏడుగురు కొత్త ఎస్‌హెచ్‌ఓలు

నగర శివారు ప్రాంతాలలో ఐదేళ్ల వ్యవధిలో అనూహ్యంగా పెరిగిన జనాభాతో పాటు అదే స్థాయిలో క్రైమ్ రేటు పెరుగుతూ వస్తుంది. నేర నియంత్రణ కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 7నూతన ఎస్‌హెచ్‌ఓలను మంజూరు చేసింది.

కొత్త ఠాణాకు ఇవే సవాళ్లు..

సూరారం ప్రాంతాన్ని అనుకొని జీడిమెట్ల, దూలపల్లి, సూరారం పారిశ్రామికవాడలు ఉండడంతో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి అనేకమంది వలస వచ్చి ఇక్కడ నివసిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతాన్ని మినీ ఇండియాగా చెప్పుకోవచ్చు. ఎక్కువ శాతం మురికివాడలు, నిరక్షరాస్యత ఉండడంతో అదే స్థాయిలో పోకిరీల బెడద, గంజాయి, దొంగతనాలు కేరాఫ్‌గా నిలిచింది. గతంలో స్థానికంగా ఉగ్ర శిక్షణ ఇస్తున్నారనే సమాచారంతో ఎన్ఐఏ బృందం పలువురిని విచారించి అదుపులోకి తీసుకుంది.

నేర నియంత్రణ లక్ష్యంగా...



కొత్తగా మంజూరైన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేర నియంత్రణ లక్ష్యంగా పనిచేస్తాం. త్వరలో కాలనీ, బస్తీ సంక్షేమ సంఘం సభ్యులతో సమావేశమై నేరాలు జరగకుండా పలు సూచనలు చేస్తాం. ఎవరికైనా అన్యాయం జరుగుతే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. పైరవీకారులను నమ్మకండి.

– వెంకటేశ్వర్‌రావు, సూరారం ఇన్‌స్పెక్టర్

శుభపరిణామం..



సూరారం పోలీస్‌స్టేషన్ లేక స్థానికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నాం. స్థానికంగా పోలీస్ స్టేషన్ మంజూరు కావడంతో నేరాల నియంత్రణకు మార్గం సుగమమైంది.

– చాంద్ పాషా, సాయిబాబానగర్

సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే ప్రాంతాలు

కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో అత్యధిక క్రైమ్ జరిగే సూరారం ప్రాంతానికి నూతన ఠాణాను కేటాయించింది. దుండిగల్, జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కొంత భాగాన్ని వేరుచేసి సూరారం పోలీస్‌స్టేషన్‌కు కేటాయించింది. దీంతో గాజులరామారం, సూరారం, సుభాష్‌నగర్ డివిజన్లలోని కొంత భాగం నూతన పోలీస్ స్టేషన్ పరిధిలోకి కేటాయించారు.



దుండిగల్ ఠాణా నుంచి 20 ప్రాంతాలు సూరారంకు..

గతంలో దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరారం ప్రాంతానికి చెందిన 20 ప్రాంతాలను కొత్తగా మంజూరైన ఠాణాకు కలిపారు. అవి దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూరారం గ్రామం, సూరారం కాలనీ, జయశంకర్‌నగర్, సాయిబాబానగర్, రాజు గృహకల్ప సముదాయం, హమీద్ బస్తీ, 60 గజాలు, మరాఠి బస్తీ, సుందర్‌రావునగర్, సుందర్‌నగర్, కష్టానగర్, న్యూ శివాలయ నగర్, పాండు బస్తీ, రాళ్లకంచ (భగత్ సింగ్‌నగర్), విశ్వకర్మ కాలనీ, ప్రియాంకనగర్, వెంకట్ రామ్‌నగర్, మస్తానా బిల్డర్, మైత్రినగర్, తెలుగుతల్లినగర్.

జీడిమెట్ల నుంచి 8 ప్రాంతాలు సూరారంకు..

జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనిమిది ప్రాంతాలను సూరారంకు కేటాయించారు. అవి రాజీవ్‌గాంధీ నగర్, ఆదర్శనగర్ పార్ట్, కూన మహాలక్ష్మీనగర్, మెట్టుకానీ గూడ, ఓక్షిత్ ఎన్‌క్లేవ్, లాల్ సాహెబ్‌గూడ, బతుకమ్మ బండ, దేవేందర్‌నగర్ ప్రాంతాలు ఇక నుంచి సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రానున్నాయి.

నేడు సుచిత్రకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఆదివారం షాపూర్ నగర్‌లోని ఉషోదయ టవర్స్‌లో బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని విజయాలను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్విహిస్తున్నామని అన్నారు. సుచిత్రలో కేంద్ర ప్రాజెక్టులపై సోమవారం నిర్వహించనున్న సమావేశానికి కేంద్ర బొగ్గు గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి హాజరు కానున్నారని తెలిపారు. ‘మహాజన్ సంపర్క్ అభియాన్’ పేరిట నెల రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా కేంద్ర ప్రాజెక్టు పనులు పరిశీలించడంతో పాటు ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రవేశ పెట్టిన పథకాలు, సాధించిన విజయాలపై ప్రజలకు వివరిస్తమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా తమ పార్టీ అధికారంలోకి వస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కేశవ్ యాదవ్, రవి బావిగడ్డ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. ఎస్.మల్లారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌తో ఎంతో మందికి మేలు

దుండిగల్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని 27 మంది లబ్ధిదారులకు రూ.13.52 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంభీపూర్ కృష్ణ మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు.


ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

ఈదురు గాలులు.. నేలకొరిగిన చెట్లు



సుభాష్‌నగర్: ఈదురు గాలులతో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రాంతాలలో చెట్లు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో ఇళ్ల రేకులు ఎగిరి పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్ వెళ్లే ప్రధాన రోడ్డు జయరామ్‌నగర్ వద్ద రద్దీగా ఉన్న సమయంలో ఒక్కసారిగా భారీ చెట్టు విరిగిపడి పోయింది. దీంతో అప్రమత్తమైన స్థానికులు కూరగాయల వ్యాపారులు పరుగులు పెట్టడంతో ప్రాణలు దక్కించుకున్నారు. కూరగాయలు ఉంచిన టేబుళ్లు ధ్వంసమయ్యాయి.



నేడు పర్యావరణ ర్యాలీ

జీడిమెట్ల: పీసీబీ ఆధ్వర్యంలో సోమవారం పర్యావరణ ర్యాలీ నిర్వహించనున్నట్లు పీసీబీ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ మేడ్చల్ జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పరుస్కరించుకుని మొదటిరోజు జీడిమెట్ల ఐలా కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రజలకు పర్యావరణంపై అవగాహన కలిగించడానికి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో పరిశ్రమల యాజమాన్యలు, కార్మికులు పర్యావరణ ప్రేమికులు పాల్గొనాలని పీసీబి అధికారులు కోరారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ


మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: రాష్ట్ర ఆర్థిక, వైద్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావును ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జిన్నారం వెంకటేశ్‌గౌడ్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

జిమ్ నిర్వహణ ఏది?



జగద్గిరిగుట్ట: గాజులరామారం సర్కిల్‌లో 125 వార్డు గాజులరామారంలోని ఆర్‌కే లేఅవుట్‌లో, 126 వార్డు జగద్గిరిగుట్టలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలోని 1వ బ్లాక్ వద్ద ఉన్న పార్క్‌లో, 128 వార్డు చింతల్‌లోని పార్క్‌లో, 129 వార్డు సూరారంలోని శ్రీరాంనగర్‌లో గతేడాది ఈ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. కాని వాటి నిర్వహణ అంతంత మాత్రమే ఉండటం, జిమ్ సామగ్రితో పాటు, సివిల్ వర్క్‌తో చేసిన ఫ్లోరింగ్‌కు వేసిన మ్యాట్ ఊడిపోయాయి. అలాగే ఈ జిమ్‌లు ఏర్పాటు చేసిన పార్క్ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం ఇటు యువత, అటు పెద్దవారు ఇక్కడికి రావాడానికి ఆసక్తి చూపడంలేదు. కేవపం పిల్లలు మాత్రమే వచ్చి ఈ జిమ్ పరికరాలను ఆట వస్తువులుగా ఉపయోగించుకుంటున్నారు. ఒక్కో వార్డులో రూ.11లక్షల చొప్పన ఏర్పాటు చేసిన ఈ జిమ్‌లు ఇలా ఎవరికీ ఉపయోగపడక పోవడం విశేషం. ఇప్పటికైన అధికారులు ఈ ఓపెన్ జిమ్‌ల నిర్వహణ సక్రమంగా ఉండేట్లు చూడాలని కోరుతున్నారు.

బీజేపీ హయాంలో దేశం అన్నిరంగాల్లో ప్రగతి సాధించింది

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్నిరంగాల్లో ప్రగతి సాధించిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రధానిగా నరేంద్రమోదీ తొమ్మిదేళ్లు విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా మహా జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం షాపూర్‌నగర్ హెచ్‌ఎంటీ సొసైటీలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎనిమిది డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.

◆ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్, ఇతర రాజకీయ పక్షాల హయాంలో సాధించలేని ప్రగతిని ప్రధాని నరేంద్రమోదీ చేసి చూపించారన్నారు. ఇది జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ఓర్వలేకే విమర్శలు చేస్తున్నాయన్నారు. ఒక వైపు అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవాన్ని ప్రధాని మోదీ నిలుపుతుంటే.. అదే వేదికగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దేశ గౌరవాన్ని దిగజార్చేందుకు కొన్ని శక్తులతో కుట్ర పన్నుతున్నారని.. ఇది దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

◆ కేంద్ర పథకాలను ప్రజలకు చేరకుండా బీఆర్ఎస్ పభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. కేంద్ర పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు ఎంఎస్ వాసు, గరిగె శేఖర్, బావిగడ్డ రవి, చండి శ్రీనివాస్, పత్తి రఘుపతి, లక్ష్మీపతి రాజు, గడ్డం రాజేందర్‌రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు పున్నా రెడ్డి, దుర్యోధన్ రావు, కంది శ్రీరాములు, పత్తి సతీష్, ఇంచార్జులు రాజిరెడ్డి, బిల్లా, సుశాంత్, వివిధ మోర్చాల నాయకులు, డివిజన్ నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

సుభాష్‌నగర్: ఒడిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. రైలు దుర్ఘటనలో మృతి చెందిన వారికి సంఘీభావంగా ఆదివారం పున్నారెడ్డి ఆధ్వర్యంలో గాజులరామారంలో కేండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. అనంతరం పున్నారెడ్డి మాట్లాడుతూ.. రైలు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్సలు అందించాలన్నారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాలీలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సొంటిరెడ్డి ఆధ్వర్యంలో కేండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శిల్పుల ఆశలు ఆశాఢంపైనే..

జగద్గిరిగుట్ట: ఆశాఢ మాసం ఈనెల 20వ తేదీ నుంచి మొదలు కానున్న నేపథ్యంలో తెలంగాణలో వైభవంగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు ఏదో ఓ చోట దేవాలయ నిర్మాణాలు, అందులో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించడం అనవాయితీ.

ఈ విగ్రహాలను తయారు చేసే శిల్పులు మాత్రం ఈ నెలలో జరిగే విగ్రహాల అమ్మకాలపైనే ఎక్కువ ఆధారపడతారు. ఆశాఢ మాసం ఎదురు చూపు సంవత్సరం మొత్తం ఓ ఎత్తయితే ఈ ఒక్క నెలపైనే వారికి ఎక్కువ ఆశలు. ఈ ఆశాఢమాసంలో సాధ్యమైనంత వరకు లాభాలు వస్తాయని శిల్పులు ఆశిస్తారు.

◆ జగద్గిరిగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 25 సంవత్సరాలుగా ఈ విగ్రహాలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. తమకు ఉత్తమ శిల్ప కళాకారులుగా ప్రభుత్వం నుంచి అవార్డు వచ్చిందని వారు తెలిపారు. కాని ఇప్పటి వరకు ఎలాంటి ప్రోత్సాహం ప్రభుత్వం నుంచి అందలేదని వాపోయారు.



◆ తెలంగాణలో ప్రతిష్టాపకంగా నిర్మితమైనా యాదాద్రి పుణ్యక్షేత్ర నిర్మాణంలో తెలంగాణలో ఉన్న శిల్పులను గుర్తించి వారికి ఆ సమయంలో జీవనోపాధి కల్పించడం సంతోషంగా ఉన్నా.. తమకు ప్రతీ నెల అందరిలాగే పెన్షన్ లేదా ఏమైనా సంక్షేమ పథకాలు తమకు అందేల చూడాలని కోరుతున్నారు.

ఎఫ్‌టీఎల్ ఖాళీ స్థలం ఆక్రమించి పనులు

జీడిమెట్ల: ఎఫ్‌టీఎల్ స్థలంలో పనులు నిర్వహిస్తూ వాతావరణ కాలుష్యానికి కారణం అవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. జీడిమెట్లలోని ఫాక్స్‌సాగర్‌కు చెందిన ఎఫ్‌టీఎల్ ఖాళీ స్థలంలో కొంతమంది స్థలాన్ని అక్రమించి స్యాండ్‌ప్రెషర్ పనులను నిర్వహిస్తున్నారు. ఫాక్స్‌సాగర్ స్థలంలో పనులు నిర్వహిండమే గాక వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్న పీసీబీ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

◆ కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు ఆరు సంవత్సరాలుగా ఎఫ్‌టీఎల్ ఖాళీ స్థలంలో పరిశ్రమకు చెందిన పనులను చేసుకుంటున్నారు. సదరు ఖాళీ స్థలంలో స్యాండ్‌ప్రెషర్ పనులు నిర్వహిస్తుండటంతో విపరీతమైన దుమ్ము గాలిలోకి వెలువడుతుంది. చెరువు స్థలంలో ఇలాంటి పనులు నిర్వహిస్తుండటంతో మూగజీవాలకు ముప్పు వాటిల్లుతోందని వాతావరణ ప్రేమికులు అంటున్నారు.


ఎఫ్‌టీఎల్ స్థలంలో పనులు నిర్వహిస్తుండగా వెలువడుతున్న దుమ్ము

◆ ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని చెరువు పరిసరాల్లో కాలుష్యానికి కారణం అవుతున్న పరిశ్రమలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిదంగా ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్ స్థలంలో నడుస్తున్న పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరతున్నారు.

నూతన విద్యావిధానంపై ఉపాధ్యాయులకు అవగాహన

కుత్బుల్లాపూర్: టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఉపాధ్యాయులకు ఆదివారం నూతన విద్యావిధానంపై గ్రూప్ చైర్మన్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొ.రాజీవన్ కరాల ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై పలు మెలకువలను అందించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్ని భాషాలపై పట్టు సాధిస్తే ఎక్కడైనా ఉపాధి పొందే అవకాశముంటుందని అన్నారు. నేటి తరం విద్యార్థుల భవిష్యత్‌పై టీచర్లు సిద్ధహస్తులై వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఓరియంటేషన్‌లో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన 142 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

